ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 02 సంచిక -358 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 26 నవంబర్ 2025

# ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతికి చిహ్నం

రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి

ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం

ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి

అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ







**అయోధ్య, నవంబర్ 25 ఆంధ్రప్రగతి:** భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిం చారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మిగతా2లో...



## రాయలసీమలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు
- అధికారులతో సమీక్షలో చంద్రబాబు నిర్ణయం



**అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి** ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు మిగతా2లో...

## ఇలాంటి కంటెంట్ వద్దు

వైఎస్ జగన్‌పై వివాదాస్పద పోస్టుపై స్పందించిన లోకేశ్

వ్యక్తిగత దాడులు వద్దంటూ టీడీపీ శ్రేణులకు హితవు

రాజకీయాల్లో హుందాతనం, గౌరవం పాటించాలని పిలుపు

అలాంటి కంటెంట్‌ను ఎవరూ ప్రోత్సహించవద్దని స్పష్టమైన సూచన



## మన నాగరికత భారతదేశానికి పునాది

- మన మూలాల్లోకి తిరిగి కనెక్ట్ అవుదాం
- అయోధ్య ధ్వజ్ ఆరోహణపై పవన్



**అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి** మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మేథో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం మిగతా2లో...

## 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

- ఉగాదిలోగా మరో అయిదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం
- మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి




**అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి** 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళ్లు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం మిగతా2లో...

## ఎపిలో కొత్తగా మరో మూడు జిల్లాలు

మార్కాపురం, మదనపల్లె, పోలవరం ఏర్పాటు

కేబినేట్ సబ్ కమిటీ ప్రతిపాదనలకు సిఎం అంగీకారం

**అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి** ఎపిలో కొత్తగా మూడు జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా ఈ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజ న్లు, మండలాల మార్పు చేర్పులపై సచివాలయంలో కీలక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా మూడు జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది






## పోలీస్ కస్టడీకి జోగి రమేశ్


- నేటి నుంచి నాలుగురోజులు విచారణ

**విజయవాడ,నవంబర్25ఆంధ్ర ప్రగతి :**నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో మిగతా2లో...

## మోగిన స్థానిక ఎన్నికల నగారా

- మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి






**హైదరాబాద్,నవంబర్25ఆంధ్ర ప్రగతి** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించ నున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళ వారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల

## చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

- లోతైన దర్యాప్తు జరిపించాలన్న బండి
- సిఎం రేవంత్ రెడ్డికి లేఖ



**హైదరాబాద్,నవంబర్25ఆంధ్ర ప్రగతి :** తెలంగాణలో చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై అనుమానాలున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. వీటిపై విచారణ జరగాలని అన్నారు. ఎందుకు ఇలా జరుగుతున్నా యో తేల్చాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై కట్టిన చెక్ డ్యామ్‌లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనుగుల- గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూలడమే ఇందుకు

# ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతికి చిహ్నం

(మొదటి పేజీ తరువాయి)

ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతు ందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

# పోలీస్ కస్టడీకి జోగి రమేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయనను విచారించనున్నారు. ఈ మేరకు నేటి నుంచి 4 రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఎక్సైజ్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసులో జోగి రమేష్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు. ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్ రావు, ఏ2గా ఉన్న అద్దేపల్లి జగన్‌మోహన్ రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే మొదటి నుంచి ఈ వ్యవహారం వెనుక జోగి రమేష్ ఉన్నారని, ఆయన సమక్షంలో లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై అధికారులు ఇప్పటికే అద్దేపల్లి బ్రదర్స్‌ను రెండు సార్లు విచారించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ స్కామ్‌లో జోగి రమేష్ పాత్రపై జనార్ధన్ రావు, జగన్‌మోహన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. ఈ పరిణామల నేపథ్యంలో జోగి రమేష్‌ను 10 రోజుల పాటు కస్టడీ కోరుతూ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయస్థానం 4 రోజుల పాటు విచారించేందుకు అనుమతి ఇచ్చింది. ఏపీ లిక్కర్ స్కామ్‌లో జోగి రమేష్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు జోగి రమేష్ నకిలీ మద్యం గురించి వార్తలను లీక్ చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. జోగి రమేష్ నకిలీ మద్యం తయారీకి ఆదేశించారని, ఆ సమాచారాన్ని వైసీపీ మీడియాకు లీక్ చేశారని అధికారులు నిర్ధారించారు. జోగి రమేష్ సూచనల మేరకే తాము నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్ధన్ రావు పోలీసుల ముందు అంగీకరించిన విషయం తెలిసిందే.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

# చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ పాలనతో కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చెక్ డ్యామ్‌లను నిర్మించిన కాంట్రాక్టర్లు కాంగ్రెస్ వాళ్లేనని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపులపై మీరు ఆదేశించిన విజిలెన్స్ విచారణ ఏమైందని బండి ప్రశ్నించారు. ఆనాడు బాధ్యులపై చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే తనుగుల-గుంపుల చెక్ డ్యామ్ కూలేది కాదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ డ్రామాలాడుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెక్ డ్యామ్‌ల నిర్మాణాల్లో అక్రమాలు, కూలిపోవడంపై విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులు జప్తు చేసి ఆ సొమ్ముతోనే మళ్లీ డ్యామ్‌లు నిర్మించాలని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

# ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు

**● రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**



**అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి** లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి మొదలు పెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫాస్టక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ-లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు సూచించారు. మొత్తంగా ఐదు రంగాలను ఈ కార్పొరేషన్ అనుసంధానించనుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులను అనుసంధానిస్తూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడంపై ఈ ఏపీ-లింక్ దృష్టి పెట్టబోతోంది. రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీ లింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషనుకు ఒక ఎండీతో పాటు, వివిధ అనుబంధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సేవలిందిస్తారు. అలాగే సలహా కమిటీని, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేయడానికి జిల్లా స్థాయి సెల్స్ ఏర్పాటు చేయనున్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే హోల్డింగ్ కంపెనీ తరహాలో ఏపీ-లింక్ వ్యవహరించనుంది. ఏపీ లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని, అలాగే క్షేత్ర స్థాయిలో వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# మంగళగిరి ఎయిమ్స్‌కు చెవిరెడ్డి తరలింపు



**విజయవాడ,నవంబర్25ఆంధ్ర ప్రగతి** మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జైలు అధికారులు చికిత్స కోసం ఎయిమ్స్ ఆసుపత్రి కి తరలించారు. ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ముందుగా ఆయనను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అయితే రెండు రోజులుగా తన కాళ్లు వాపు వస్తున్నాయని, వెరికోస్ వీయిన్స్ ఉందని జైలు అధికారులతో చెవిరెడ్డి చెప్పారు. వాస్కులర్ సర్జన్‌కు చూపించాలని కోరడంతో సాధారణ పరీక్షల నిమిత్తం ఆయన్ను నిన్న విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం.. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు రిఫర్ చేస్తూ సూపరింటెండెంట్ ఎయిమ్స్‌కు లేఖ రాశారు. ఎయిమ్స్ నుంచి అధికారిక అనుమతి రావడంతో ఇవాళ ఉదయం విజయవాడ జైలు నుంచి చెవిరెడ్డిని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం తదుపరి నిర్ణయం తీసుకునే వీలుంది.

# వైకుంఠం ఏకాదశి దర్శనాలు

**● డిసెంబర్ 30 నుంచి 8 వరకు దర్శన భాగ్యం**

**తిరుమల,నవంబర్25ఆంధ్ర ప్రగతి** వైకుఠం ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వారా దర్శనాలు కల్పించనున్నట్లు టిటిడి వెల్లడించింది. మొదటి మూడ్రోజులు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా, ఆ తర్వాత ఏడు రోజులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా సర్వదర్శనాలు ఉంటాయని పేర్కొంది. ఈ క్రమంలో తొలి మూడ్రోజులు ఎస్ఈడీ, శ్రీవాణి దర్శనాలు రద్దు చేయనున్నట్లు తెలిపింది. ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ దర్శనాలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. వైకుంఠ ద్వార దర్శన రోజులైన డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. మొదటి మూడు రోజుల వైకుంఠ ద్వారా దర్శనాలకు నవంబర్ 27న ఉదయం 10 గంటల నుండి డిసెంబర్ 1న సాయంత్రం 5 గంటల వరకు తితిదే వెబ్‌సైట్ , తితిదే యాప్, వాట్సాప్‌లో ఏపీ గవర్నమెంట్ బాట్‌లో తితిదే ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్ డిప్‌కు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ వివరాలు వెల్లడిస్తారు.

# రాయలసీమలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ధి కలిగేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టింది. మారుతున్న ఆహారపు అలవాట్లు, డిమాండ్ ఉన్న పంటల సాగు, టెక్నాలజీ వాడకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హార్టికల్చర్ పంటలకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎపిలో కొత్తగా మరో మూడు జిల్లాలు

. ముందు నుంచి చెబుతున్నట్టుగా మార్కాపురం, మదనపల్లి జిల్లాల ఏర్పాటుకు మంత్రివర్గం ఓకే చెప్పింది. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు అంగీకరించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సమీక్ష నిర్వహించిన అనంతరం మార్పులు చేర్పులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయిం చారు. కర్నూ లు జిల్లా పెద్ద హరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా.. ఆదోని మండలాన్ని విభజించి కొత్త మండలం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఓకే చెప్పారు. ఇక కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

# మన నాగరికత భారతదేశానికి పునాది

(మొదటి పేజీ తరువాయి)

నేర్పిన మేథో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు. గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు. 8 లక్షల ఇళ్లు శాంక్షన్ అయితే 30 శాతం మాత్రమే పూర్తి చేశారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ తీసుకున్న రాక్రీట్ నిర్మాణ సంస్థ.. స్కీంకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. 47 వేల 850 ఇళ్లు తీసుకుని నిర్మిస్తామని చెప్పి ఎక్కడా పూర్తి చేయలేదన్నారు. 80 కోట్ల రూపాయలు అవకతవకలు చేశారని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. రాక్రీట్ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇప్పటికైనా ఆప్షన్ 3లో పేమెంట్ కింద చివరి దశలో ఉన్న నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

## ఉద్భవ్-2025' పేరుతో డిసెంబర్‌లో జాతీయ స్థాయి

**అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి :**'ఉద్భవ్-2025' పేరుతో డిసెంబర్‌లో ఏపీలో జాతీయ స్థాయి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, లోగోను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారి జాతీయ స్థాయి ఉద్భవ్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో పోటీలు వైభవంగా నిర్వహిస్తున్నాం. 22 రాష్ట్రాల నుంచి 1800 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. కేఎల్ యూనివర్సిటీలో 12 వేదికలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తాం అని సంధ్యారాణి తెలిపారు.

# ఇలాంటి కంటెంట్ వద్దు

## వైఎస్ జగన్‌పై వివాదాస్పద పోస్టుపై స్పందించిన లోకేశ్

### వ్యక్తిగత దాడులు వద్దంటూ టీడీపీ శ్రేణులకు హితవు

**నవంబర్25ఆంధ్ర ప్రగతి**

రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. వైసీపీ అధినేత జగన్‌ను కించపరిచేలా ఉన్న ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎక్స్ వేదికగా ఓ టీడీపీ అభిమాని పోస్ట్ చేసిన వీడియోలో... ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నడుచుకుంటూ వెళుతుండగా.. జగన్ రోడ్డు పక్కన కూర్చుని ఓ ప్లకార్డు ప్రదర్శిస్తుండడం చూడొచ్చు. ఆ ప్లకార్డుపై "నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వండి" అని రాసి ఉంది. ఈ పోస్టు వైరల్ కావడంతో లోకేశ్ స్పందించారు."నా ప్రియమైన టీడీపీ కుటుంబానికి.. ఇలాంటి కంటెంట్ వెనుక ఉన్న భావోద్వేగాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ, వ్యక్తిగత దాడులు ఎప్పటికీ మంచివి కావు. మేం రాజకీయ ప్రత్యర్థులం కావచ్చు, కానీ మన చర్యలు గౌరవప్రదంగా ఉండాలి" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు."మన మద్దతుదారులతో సహా ప్రతి ఒక్కరూ ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని నేను అభ్యర్థిస్తున్నాను. విభేదాలు ఉన్నప్పటికీ హుందాతనాన్ని పాటిద్దాం. ఆంధ్రప్రదేశ్‌ను బలోపేతం చేసే నిర్మాణాత్మక రాజకీయాలపై దృష్టి సారిద్దాం" అని ఆయన కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై అనవసరమైన ట్రోలింగ్‌కు స్వస్తి పలకాలని ఆయన పరోక్షంగా సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 26 నవంబర్ 2025

# డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం పగడ్బందీగా అమలు చేయాలి.

**పిల్లలందరూ 100% ఇష్టపడి భోజనం చేసేలా చర్యలు చేపట్టాలి. -జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 25:**
డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మధ్యాహ్న బడి భోజన పథకంపై సంబంధిత అధికారులతో స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ....పిల్లలందరూ ఇష్టపడి 100% భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు చేయాలన్నారు. జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించడానికి, బడికి వస్తున్న పిల్లల సంఖ్యను పెంచేందుకు, పిల్లల మధ్య సామాజిక బంధాలను మెరుగుపరిచేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం అమలు చేస్తున్నామని ఈ పథకంలో ఎటువంటి సమస్యలున్నా




తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కొన్నిచోట్ల విద్యార్థులు భోజనం చేయకుండా ఇళ్లకు వెళ్లిపోతున్నారని అలా కాకుండా ప్రతి విద్యార్థి భోజనం చేసేటట్లుగా చూడాలన్నారు. కోడిగుడ్లు సకాలంలో పాఠశాలలకు సరఫరా చేసేటట్లు చూడాలని గుడ్లు సరఫరాలో సమస్యలు లేకుండా డ్యామేజ్ ఉన్న, అన్సైజ్ గుడ్లను వెనక్కి పంపించాలన్నారు. విద్యార్థులకు మంచి




పోషకాహారాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం నుండి శనివారం వరకు మెనూలో పెట్టే వివిధ ఆహార పదార్థాలపై జాయింట్ కలెక్టర్ కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రెడ్డి, ఎంఈఓ లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూనేపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిరు వ్యాపారులకు న్యాయం జరిగేలా చూడాలి.

**- మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు సిఐటియు వినతి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 25:**నంద్యాల నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న చిరు వ్యాపారస్తుల జీవనం కోసం న్యాయం చెయ్యాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ కి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూక్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తోటమద్దులు, శ్రీనివాసమూర్తి, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం లతోపాటు టిడిపి సీనియర్ నాయకులు మిద్దె. ఉసేని, నూనెపల్లె టీడీపీ మాజీ కౌన్సిలర్ శివ శంకర యాదవ్, గుద్దేటి వెంకటేశ్వర్లు, మంజుల సుబ్బరాయుడు , జెపి , బ్యాంకు తిమ్మయ్య లు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి.



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 25:**
భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని నంద్యాల జిల్లా వనరుల కేంద్రం డిడిఏ మద్దిలేటి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకి భూసార ఆరోగ్యంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిడిఏ ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటినుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు.నేల ఆరోగ్యం పెంచుకోవడానికి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు విరివిగా వాడాలని తెలిపారు.భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాట ద్వారా, వ్యవసాయంలో ఖర్చును తగ్గించుకోవచ్చునని అన్నారు. నేల కాలుష్యాన్ని పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవడం ద్వారా మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిటియం ఉమా మహేశ్వరి, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా ఎస్ పి ని కలిసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి.

**ఎంపీ ఆఫీసులో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని, అన్ని వర్గాల సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తోందని, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ద్వారా జిల్లాలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా ఎస్ పి సునీల్ షారాన్ ను మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బొమ్మలసత్రంలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో సమస్యలు ఎక్కువ ఉన్నాయని వాటి పరిస్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ఎంపీ నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ కార్యాలయం వచ్చిన వారి వినతులు ఆయా శాఖ అధికారుల సహకారంతో పరిష్కరిస్తున్నామని, కొన్నింటికి దశలవారీగా పరిష్కారం చూపుతామని బైరెడ్డి హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేసేందుకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రాజకీయాల్లోకి వచ్చారని, ఎంపీగా పని వత్తిడి ఎక్కువ ఉన్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ శబరి పనిచేస్తున్నారని, ప్రజల దీవెనలు ఆమెకు ఉండాలన్నారు.
ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ ఎ. వెంకటరంగయ్య, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ మెంబర్ పెరుమాళ్ళ విజయకుమార్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విజయగౌరి, టీడీపీ నాయకులు భవనశి పుల్లయ్య, కోడూరు సంజీవరెడ్డి, బైరెడ్డి అభిమాన సంఘం నాయకులు గోపాల్ యాదవ్, నందకుమార్ యాదవ్, గోరుకల్లు ఎరుకలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో “రైతన్న.. మీ కోస కార్యక్రమం.

**- పాల్గొన్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వని.**

**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 25:**



వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని దీనికోసం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని మహానంది మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. మంగళవారం మహానందిలో ఎంపీపీ గారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దేశ ఆరోగ్య ప్రయోజనాలను కాపాడేందుకు సాంప్రదాయ వ్యవసాయంపై ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించే దిశగా “రైతన్న మీ కోసం” కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 24 నుండి 29వ తేదీ వరకూ చేపట్టినట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఒక యాప్ను కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, మీ పంట ఎలా ఉంది, సమయానుకూలంగా ఏయే చర్యలు తీసుకోవాలి, పండిన పంట ధరలు ఏ విధంగా ఉన్నాయి, వేసిన పంట ఎప్పుడు కోతకు వస్తుంది తదితర వివరాలతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి మొదలు గ్రామ వ్యవసాయ అధికారి వరకూ అందరి సెల్ ఫోన్ నెంబర్లతో సహా యాప్లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఈనెల 29వ తేదీ వరకూ గ్రామాల్లో అధికారులు పర్యటించి రైతులకు వ్యవసాయ పరిస్థితులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల పార్టీ కన్వీనర్ కంచర్ల శివ, క్లస్టర్ ఇంచార్జి చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు గంగిశెట్టి మల్లికార్జునరావు, సుదర్శన్ రెడ్డి, మహిళా నాయకురాలు కొమ్మొద్ది ఉమాదేవి, హరినాథ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాల వినియోగం.. మానవుని జీవనశైలిలో మార్పులు.

**జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్.**

**సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చు.**

**-ఆహార శాస్త్రవేత్త, మిల్లెట్స్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా. ఖాదర్ వలి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 25:**
చిరుధాన్యాల వినియోగం వల్ల మానవుల ఆరోగ్య జీవనశైలిలో అనేక అనుకూల జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రముఖ ఆహార శాస్త్రవేత్త, మిలెట్స్ మాన్ ఆఫ్ ఇండియాగా పిలువబడే డాక్టర్ ఖాదర్ వలీ గారిచే భారతీయ స్టేట్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పోషక విలువలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి. హేమ, ఆర్ఎఆర్ఎస్ డైరెక్టర్ డా.జాన్సన్, నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.సురేఖ, రిటైర్డ్ ప్రొఫెసర్ గంగిరెడ్డి, మిబుల్స్ వ్యవస్థాపకులు ఎ.వి.రామ్ సుబ్బారెడ్డి, ఎస్బిఐ బ్యాంకు సిబ్బంది, ఆరోగ్య అభిలాషులు, గృహిణులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ, చిరుధాన్యాల వినియోగం మానవుల జీవనశైలిలో అనేక అనుకూల మార్పులను తీసుకురావడంతో పాటు ఆరోగ్య పరంగా కూడా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. శారీరక, మానసిక వికాసానికి చిరుధాన్యాలు దోహదపడతాయని చెప్పారు. మిల్లెట్స్ను ఆహారంలో చేరుస్తే రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, జీర్ణక్రియ మెరుగుదల, ఎముకలకు



బలాన్నందించడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. వీటిలో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలున్నందున మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అంతకుముందు డాక్టర్ ఖాదర్ వలి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య రక్షణకు సిరిధాన్యాలే మార్గమన్నారు. సిరి ధాన్యాలు భారతీయ ఆహార వ్యవస్థలో శతాబ్దాలుగా ఉన్న సంప్రదాయ ధాన్యాలు అని, ఆధునిక జీవనశైలి కారణంగా పక్కనపెట్టబడిన ఈ ధాన్యాల పునరాగమనమే భవిష్యత్తు ఆరోగ్య రక్షణకు మార్గమని పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు, కొవ్వు పెరుగుదల, హార్మోన్ అసమతౌల్యం, హృదయ రోగాలు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడంలో సిరి ధాన్యాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని శాస్త్రీయ ఉదాహరణలతో వివరించారు. సిరి ధాన్యాల సాగు పర్యావరణానికి అనుకూలమని, తక్కువ నీటితో మరియు తక్కువ వ్యయంతో పెంచవచ్చు కాబట్టి రైతులకు ఆర్థికంగా కూడా లాభదాయకమని తెలిపారు. రసాయన ఎరువుల అవసరం లేకుండా సహజ పద్ధతుల్లోనే మంచి ఉత్పత్తి ఇచ్చే ఈ ధాన్యాలను ప్రోత్సహించడం ప్రభుత్వాలూ,





రైతులూ, వినియోగదారులూ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలి అని సూచించారు. మనుషుల ఆరోగ్య శైలి, జీవన విధానాలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అదే విధంగా కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిధులు కూడా చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు.
అనంతరం జిల్లా ప్రతీకగా నిలిచిన నంది విగ్రహాన్ని పద్మశ్రీ డా. ఖాదర్ వలికి జాయింట్ కలెక్టర్ అందజేసి శాలువతో సత్కరించారు.

# మాది రైతు ప్రభుత్వం.!

**రైతు పక్షపతిగా సీఎం నారా చంద్రబాబు పనిచేస్తున్నారు.**

**రైతుల మేలుకోసమే రైతన్నా.. మీ కోసం.-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 25:**
మాది మంచి రైతు ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు పక్షపతిగా పాలన చేస్తున్నారు, రైతల మేలుకోసం రైతన్నా.. మీ కోసం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.
మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇంటి ఆవరణలో రైతన్నా.. మీకోసం అవగాహన సధస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ, మైకనేజేషన్ టెక్నాలజీ, ప్రకృతి వ్యసాయం, ఆధునిక టెక్నాలజీ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడి సాయం రైతులకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మా ఉమ్మడి ప్రభుత్వం అని, ఉమ్మడి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. 'రైతన్నా–మీకోసం కార్యక్రమాన్ని ఈ నెల నవంబర్ 24 నుండి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలనే లక్ష్యంతో ఉమ్మడి ప్రభుత్వం పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తోందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.
నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు, ఈ పంచ



సూత్రాల ద్వారా వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి, అన్నదాతలకు అన్నివిధాలా అండగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉంటుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ నాగేశ్వరావు, రైతులు చంద్రుడు, శివ, కరీం, సత్యం రెడ్డి, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలి

**హక్కుల గురించి మాట్లాడతారు కానీ... బాధ్యతల గురించి ఆలోచించరు: మంత్రి నారా లోకేశ్**

**హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచన**

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన భోజనం అందించేందుకు కృషి**

**ఆంధ్ర ప్రగతి నవంబర్ 25:**
రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అందరూ మాట్లాడతారని, కానీ బాధ్యతల గురించి ఆలోచించరని, హక్కులతో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిలోని మున్సిపల్ హైస్కూల్కు చెందిన విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుట్లమ్మ, రేపు జరగనున్న 'స్టూడెంట్ మాక్ అసెంబ్లీ'కి ఎంపికైన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించి మాట్లాడారు.
మంగళగిరి బీఆర్ నగర్లోని మున్సిపల్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ, పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఈ గౌరవాన్ని దక్కించుకుంది.
ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, “నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యువశక్తి ప్రాధాన్యత గురించి తరచూ చెబుతుంటారు. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలనే ఆలోచనను సీఎం గారితో చర్చించి నిర్ణయించాం” అని తెలిపారు.
పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ వివరించారు. “అమ్మకు చెప్పలేని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సులో చక్కగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి” అని ఆకాంక్షించారు.
ప్రతి ఏటా స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని, కనకపుట్లమ్మను చూసి మరో పది మంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా, “రేపటి మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?” అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి సీఎం, స్పీకర్ హాజరవుతున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.
మాక్ అసెంబ్లీకి ఎంపికవడంపై విద్యార్థిని ఆనందం వ్యక్తం చేస్తూ, ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం గతంలో కంటే మెరుగ్గా ఉందని తెలిపింది. దీనిపై స్పందించిన లోకేశ్, రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు మరింత నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రహదారి ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోండి.

**- జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు 25:**
రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు తీసుకుంటే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, ఇందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన అధ్యక్షతన నిర్వహించిన రహదారి భద్రతా సమావేశంలో అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఎఎస్పీ యుగంధర్ బాబు, డీఎస్పీ ప్రమోద్ కుమార్, డిటిసి శివారెడ్డి, ఎన్హెచ్ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాల తగ్గింపులో ప్రజల్లో అవగాహన కీలక పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. గత సమావేశంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని నాలుగు సర్వీస్ రోడ్ల వద్ద ఎంట్రీ%-%ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. చాపిరేవుల, కోవెలకుంట్ల ప్రాంతాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేయగా, మిగతా రెండు ప్రాంతాల్లో తక్షణమే ఏర్పాటు చేయాలని ఎన్హెచ్%-%40 అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్ని శాఖలకు ఆయన సూచించారు. శాంతిరాం ఆసుపత్రి సమీపంలో రహదారిపై రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి, అవసరమైన లైటింగ్ పెంచాలని ఆదేశించగా, 10 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఎన్హెచ్ అధికారులు తెలిపారు. ఎన్హెచ్%-%44 మార్గంలో డోన్ మండలం, దొరపల్లి గ్రామం వద్ద మెరుగైన విద్యుత్ సదుపాయాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, ఇందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు వివరించారు. బ్రాహ్మణకొట్కూరు ప్రాంతంలో ఎన్హెచ్%-%340సి రహదారి కారణంగా రైతులు సాగు భూములకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై ప్రజా పరిష్కార వేదికకు అర్జీలు వచ్చినందున వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రహదారులపై తిరుగుతున్న పాడిపశువులను తొలగించేందుకు పోలీసు శాఖ సహకారంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఎఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ, రహదారి నిర్మాణ సమయంలో గ్రామాల ఇరువైపుల ప్రజల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాసులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. భారీ వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న సర్వీస్ రోడ్లను తక్షణం పునరుద్ధరించాలని ఎన్హెచ్ అధికారులను కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం.

## నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ నవంబర్ 25:**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల ఏ ఎస్ పి ఎం.జావళి సూచనలతో నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో నంద్యాల రామకృష్ణ రెడ్డి డిగ్రీ కళాశాలలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెల్మెట్ వినియోగం, మద్యం తాగి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, వాహనాల్లో అతిగా లోడ్ వేయడం, ట్రిపుల్ రైడింగ్, వ్యతిరేక దిశలో డ్రైవింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' ప్రాధాన్యం, ప్రమాద బాధితులను సహాయం చేసే వారికి సంరక్షణ కల్పించే 'గుడ్ సమారిటన్ చట్టం' గురించి కూడా వివరించారు. ఇతర రోడ్డు నిబంధనల ఉల్లంఘనల ప్రభావాలను కూడా తెలియజేశారు. విద్యార్థులకు అవగాహన వీడియోలు, పోస్టర్లు ప్రదర్శించి రోడ్డు భద్రతపై స్పష్టమైన సమాచారం అందించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, సమాజంలో రోడ్డు భద్రత సందేశాన్ని పంచాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

# గుంతనాల గ్రామంలో 'రైతన్నా - మీకోసం' కార్యక్రమం.

**పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు. నంద్యాల ఎంపీడీవో సుగుణ శ్రీ.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 25:**
నంద్యాల మండలం, గుంతనాల గ్రామంలో వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతన్నా - మీకోసం" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రామంలోని రైతుల ఇంటింటికి స్వయంగా తిరిగి, "రైతన్నా - మీకోసం" పాంప్లెట్ పేపర్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు మరియు కార్యక్రమాల గురించి ఆయన రైతులకు వివరంగా అవగాహన కల్పించారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పలు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరియు పథకాల గురించి రైతులకు పూర్తి స్థాయిలో వివరించారు.
ఈ కార్యక్రమం నంద్యాల టిడిపి మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహానంది అభివృద్ధికి దాతల సహకారం.




**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 25:**మహానంది క్షేత్రంలోని రాజగోపురం ముందు ఎడమవైపున ఉన్న నవ వినాయకుల వద్ద కళావేదిక ప్రాంతంలో షుమారు 30 లక్షల వ్యయంతో 150ఐ120 అడుగుల విస్తీర్ణంలో తాండూరు స్పెషల్ రాళ్ళతో ఫ్లోరింగ్ చేయుటకు ముందుకు వచ్చిన పోగుల మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖరమ్మ దంపతులు ఒప్పంద పత్రాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి గారికి కర్నూలు లోని వారి స్వగృహంలో అందించారు.వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు.(మహాశివరాత్రి కళ్యాణోత్సవం, కార్తీక పౌర్ణమి రోజున కోటి దీపోత్సవంతో పాట అనేక సాంస్కృతిక కార్యక్రమాలు,భజనలు ఈ స్థలంలో చేస్తూ ఉంటారు)ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు పాల్గొన్నారు.ఇదే విధంగా క్షేత్ర అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కోరుతున్నారు.


# రామ తారకమంత్రం భక్తిముక్తిసాధకం.




**ఆంధ్ర ప్రగతి అస్పరి నవంబర్ 25:**
మనందరిలో రమించే దివ్యచైతన్యమే శ్రీరామచంద్రుడని, రామనామ స్మరణ సకల మానవులకు ఇహపరసాధకమని, భక్తి, ముక్తి సాధకమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, కారుమంచి గ్రామంలోని శ్రీజ్యోతి మూర్తి సిద్ధాశ్రమం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. తదనంతరం ప్రసిద్ధ నాటకరంగ కళకారులు పాయసం పెద్దరంగారెడ్డి శ్రీమద్రామాయణంలోని ఆదర్శ గుణాలగురించి ప్రవచించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మ ప్రచార మండల సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, సోమేశ్వరరెడ్డి,కాపు రవిప్రకాశ్ రెడ్డి,శివయ్య, జె. సత్యనారాయణరెడ్డి, కె. ఈరన్న, యం. తిమ్మప్ప, జయకృష్ణ, రంగస్వామి, సుధాకర్, సిద్ధప్ప బీరప్ప, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి మెట్ల పూజ.!





**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల నవంబర్ 25:**
కడప జిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామంలో కర్నాటి మధురెడ్డి గూడపు రెడ్డి రమణారెడ్డి గురు స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మెట్ల పూజ మంగళవారం నాడు ఘనంగా ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ప్రతిమ విగ్రహానికి పంచామృతాభిషేకాలు మరియు విశేష పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామి భజనలతో భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక ఆనందబరితులను చేశారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ కలియుగ ఆరాధ్య దైవం అయినటువంటి కారణజన్ముడు శ్రీ అయ్యప్ప స్వామి పూజ ఫలితం ఎంతో అద్భుతంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామిని సేవించి అనంతరం దర్శనార్థం శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధి చేరుకుని పావని బంగారు మెట్లని ఎక్కి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పూజకు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు మరియు పంచామృత ప్రసాద వితరణ అనంతరం అల్పాహార అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# జాతీయ సమైక్యతా స్ఫూర్తి సర్ధార్ వల్లభాయ్ పటేల్.

## జాతీయ సమైక్యత ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 25:**
భారత దేశ తొలి ఉప ప్రధానిగా, తొలి హోమ్ మినిస్టర్‌గా,ఉక్కుమనిషిగా, భారతరత్నగా చిరస్థాయిగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మంగళవారం వెలుగోడులో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
మంగళవారం మై భారత్ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో వెలుగోడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి హాజరయ్యారు. ఆమెకు మై భారత్ ం మేరా యువ భారత్ జిల్లా యువజన అధికారి రాహుల్ గిరి రెడ్డి, నూలు నాగేశ్వరరావు, ప్రతాప్ ఆచారి, పురుషోత్తం గౌడ్, వీరబ్రహ్మం, సురేష్ కుమార్, తిరుపాల్ నాయక్ తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.లిటిల్ ఏంజిల్స్, డి పాల్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపీ శబరి ఆసక్తిగా వీక్షించారు.అనంతరం సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, "జాతీయ సమైక్యతా స్ఫూర్తికి ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్. ప్రజలంతా భేదాభిప్రాయాలు పక్కన పెట్టి జాతీయ ఐక్యత భావంతో ముందుకు సాగాలి" అని తెలిపారు. లిటిల్ ఏంజిల్స్ పాఠశాల యాజమాన్యం డా. ఎం.ఎఫ్. ఇమ్మాన్యుయేల్, అప్పియా ప్రశాంత్‌లు ఎంపీకి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు సహా పలువురు అభిమానులు కూడా ఆమెను సన్మానించారు. ఎంపీ శబరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీనగర్, పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా భారీగా సాగింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బ్రహ్మం నాయక్, ప్రధానోపాధ్యాయులు మాలిక్ ఖాన్, మధు గౌడ్, సుబ్బయ్య, శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లిటిల్ ఏంజిల్స్, మోడల్, డిపోల్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 25:**
భవనిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 17 ద్వారా మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను తక్షణమే బోర్డ్ లో జమ చేయాలని రాష్ట్రంలో 50వేల పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే నిధులు విడుదల చేయాలని డోన్ సిపిఐ కార్యాలయం నందు ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాలు పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. బిల్డింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై ఈనెల 30వ తేదీన కడపలో జరుగుతున్న రాయలసీమ నెల్లూరు జిల్లాల సదస్సులో పోరాటాన్ని రూపొందిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య,ఏఐటియుసి డోన్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, అబ్బాస్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.పుల్లయ్య మంగమూరి సురేంద్ర,బిల్డింగ్ ఆర్ సి సి వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాకర్ నాయుడు,యాడికి రెహమాన్ పెయింటర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కుమార్ తెలిపారు సుంకయ్య మాట్లాడుతూ 55 సంవత్సరాలు పైబడిన కార్మికులందరికీ నెలకు 5000 పెన్షన్ ఇవ్వాలి
భవనిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భీమా సదుపాయాలు కల్పించాలి,పనిలో మరణించిన వికలాంగులైన కార్మికులకు నష్టపరిహారం పెంపుదల చేయాలి,ఈఎస్ఐ పీఎఫ్ కల్పించాలి, సంక్షేమ బోర్డులో సంఘం ప్రాతినిధ్యం కల్పించాలి . లేబర్ కార్యాలలో సిబ్బంది కొరతను నియంత్రించాలి,అడ్డాల వద్ద సెల్లర్లు నిర్మించి కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి . కార్మికుల పిల్లలకు విద్యా వైద్య సదుపాయం స్కాలర్షిప్ స్పందించాలి అని అన్నారు.



# శ్రీ సుబ్రహ్మణ్యుడే..

## శ్రీ సుబ్బారాయుడుగా వెలసిన క్షేత్రం.!

-శ్రీ కొత్తూరు సుబ్బారాయుడి నిజరూప దర్శనం.
-నేడే సుబ్రహ్మణ్య షష్టి.. కొత్తూరులో వైభవంగా వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 25:**
పాణ్యం మండలం సుబ్బరాయుడు కొత్తూరు భిన్నమైన ఆచారాన్ని పాటిస్తోంది. ఆదివారం అందరికీ సెలవు. చఆ పల్లెకూ సెలవే. కానీ మిగిలినవారికంటే కాస్త ఎక్కువ సెలవు. ఆదివారం మాంసాహారం ముట్టకపోవడం, అంత్యక్రియలు నిర్వహించకపోవడం ఈ పల్లెలో అనాదిగా వస్తున్న ఆచారం. మిగిలిన రోజుల్లో మాంసాహారం తినాలన్నా.. ఆ ఊరిలో దొరకదు. ఆరు కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సిందే. ఆసక్తి కలిగించే ఈ ఆచారం వెనుక సుబ్రహ్మణ్య స్వామి ఆలయ స్థల పురాణ నేపథ్యం ఉంది.

### ఏమిటా కథ..?

500 ఏళ్ళ క్రితం కొత్తూరు గ్రామానికి చెందిన బీరం చెన్నారెడ్డి అనే రైతు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. గట్టెక్కే మార్గం చూపాలని ఓ బ్రాహ్మణుడిని ఆశ్రయిం చాడు. మాఘ శుద్ధ షష్ఠి రోజున పొలం దున్నితే కష్టాలు తొలగుతాయని బ్రాహ్మణుడు సూచించాడు. దీంతో చెన్నారెడ్డి కాడెద్దులను నాగలికి కట్టి పొలం దున్నడం ప్రారంభిస్తాడు. ఆ సమయంలో నాగలికి ఉన్నట్లుండి భూమిలో ఏదో అడ్డుతగులుతుంది. ఆ క్షణంలోనే ఆకాశంలో 12 తలల నాగుపాము రూపం ప్రత్యక్షమౌతుంది. చఆ తేజస్సుకు రైతు కంటిచూపు కోల్పోతాడు. కాసేపటి చుట్టు పక్కల రైతులు వచ్చి నాగలిని వెనక్కులాగి చూస్తారు. అక్కడ 12 శిరస్సుల నాగేంద్రుడి విగ్రహం బయట పడుతుంది. ఒక బాలుడు ప్రత్యక్షమై తాను సుబ్బరాయుడినని (సుబ్రహ్మణ్యేశ్వస్వామి), మూడు రోజుల పాటు తనకు క్షీరాభిషేకం చేస్తే చెన్నారెడ్డికి చూపు వస్తుందని చెబుతాడు. అలా పూజలు చేయగానే చెన్నారెడ్డికి కంటిచూపు వస్తుంది. దీంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గుడి కట్టాలని గ్రామస్థులు నిర్ణయించుకుంటారు. స్వామివారిని వేడుకుంటారు. 'రాత్రి రోకలిపోటు తరువాత మొద లుపెట్టి.. తెల్లవారు జామున కోడి కూతకు ముందే గుడి నిర్మాణం పూర్తి చేయాలి' అని స్వామి సెలవిస్తాడు. లేదంటే ఏడుగురు బలి అవుతారని హెచ్చరి స్తాడు. స్వామివారి స్వయంభు విగ్రహాన్ని నేలపైనే పెట్టి గుడి నిర్మాణం ప్రారంభిస్తారు. కోడి కూతలోగా ప్రహరీ మాత్రమే పూర్తవుతుంది. పైకప్పులేని ఆలయం సిద్ధమౌతుంది. అప్పటిదాకా ఆ గ్రామం పేరు కొత్తూరు కాగా.. స్వామి వెలసిన తరువాత సుబ్బరాయుడు కొత్తూరుగా మారింది. ఇదీ స్థల పురాణం.

### ఆదివారం సెలవెందుకు..?

సుబ్రహ్మణ్య స్వామికి ప్రీతిపాత్రమైన రోజు ఆదివారం. ఎస్ కొత్తూరు గ్రామానికి ప్రతి ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. కేవలం ఆదివారం రోజే 6 నుంచి 8 వేల మంది భక్తులు స్వామిని సందర్శిస్తారు. ఆ ఒక్కరోజే సుమారు మూడు వందల అభిషేకాలు జరుగుతాయి. స్వామిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. తమను చల్లాగా చూస్తున్న స్వామి కోసం ఆదివారం ఆచారాన్ని ఆలయం నిర్మించిన సమయంలోనే ప్రారంభించారు గ్రామస్థులు. ఆదివారం వస్తే మాంసాహారం వండరు, తినరు. చగ్రామంలో మాంసాహార దుకాణాలు లేవు. చమాములు రోజుల్లో కావాలన్నా.. గ్రామానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందివర్గం వెళ్లి తెచ్చుకోవాల్సిందే. ఇక పండుగ మరుసటి రోజున మాంసాహారంతో కర్రిపండుగ నిర్వహించడం సాధారణం. చఆ పండుగ ఆదివారం వస్తే.. సోమవారానికి వాయిదా పడుతుంది.

### ఆ మూడు మాసాల్లోనూ అంతే..

ఏడాది పొడవునా ఆదివారాలతోపాటు కార్తీకం, మాఘం, శ్రావణ మాసాల్లో గ్రామస్థులు మాంసాహారం ముట్టరు. ఈ కట్టుబాటును ఎవ్వరూ మీరింది లేదు. ఆదివారాలతో కలిపి ఇలా ఏడాదిలో సుమారు నాలుగు నెలల పాటు మాంసా హారానికి దూరంగా ఉంటూ గ్రామస్థులు స్వామిపై తమకున్న భక్తిని చాటుకుం టున్నారు. చప్రతి ఆదివారం వేలాదిగా వచ్చే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు.

### అంత్యక్రియలకూ సెలవే

**కొత్తూరులో 220 కుటుంబాలు ఉన్నాయి. జనాభా సుమారు 900.ఆదివారం గ్రామస్థుల్లో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించరు. మరుసటిరోజు వరకూ మృత దేహాన్ని ఇంటివద్దే ఉంచుతారు.సోమవారం అంత్యక్రియలు నిర్వహి బస్తారు. ఇందుకూ స్వామిపై ఉన్న అపార మైన భక్తే కారణం. గ్రామానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అలాంటి పవిత్రమైన రోజున మృతదేహాన్ని తీసుకువెళితే భక్తులకు అసౌకర్యం కలుగుతుందని గ్రామస్థులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. చమృతదేహంతో వెళితే భక్తులకు అంటు తగులుతుందని తమకు తామే కట్టడి చేసుకున్నారు.**

### ఎలా చేరుకోవచ్చు...?

**బనగానపల్లె మండలం నందివర్గం నుండి S.కొత్తూరు 5 కి.మీ దూరంలో కలదు. ఇక్కడ నుండి ఆటో సదుపాయం కలదు.**

---

# జాయింట్ కలెక్టర్ జోక్యంతో..

## పత్తి కొనుగోలుకు ఒప్పుకున్న అధికారులు.



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు నవంబర్ 25:**నందికొట్కూరు నియోజకవర్గం మిడుతూరు మండలం చౌట్కూరు, గడివేముల మండలం మంచాలకట్ట గ్రామ రైతుల పత్తిని తీసే అధికారులు కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెట్టడం వల్ల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సహాయ కార్యదర్శి ఏ. సురేష్ గార్లు జోక్యం చేసుకొని పత్తి రైతులతో, పత్తి వాహనాలను కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా పెట్టి ఆందోళన చేయడం మూలంగా జాయింట్ కలెక్టర్ వద్ద జరిగిన చర్చల్లో జాయింట్ కలెక్టర్ సిసిఐ అధికారులతో, రైతు సంఘం నాయకులతో మాట్లాడి వెంటనే పత్తి కొనుగోలు చేసే విధంగా నిర్ణయం చేసి కొనుగోలు చేయించడం జరిగింది. అలాగే భవిష్యత్తులో కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి నాణ్యత పేరుతో రైతులు వెనక్కి వెళ్లకుండా ఇంటి వద్దనే నాణ్యతను పరిశీలించి కొనుగోలు కేంద్రాలకు తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కలెక్టర్ దృష్టికి తెచ్చినందువల్ల కలెక్టర్ గారు అందుకు అవసరమైన ఏర్పాట్లను మాట్లాడి చేయగలమని హామీ ఇచ్చారు. రైతుల సమస్యను వెంటనే పరిష్కరించిన జాయింట్ కలెక్టర్ కు రైతు సంఘం నాయకులు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

# నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే...

# కూటమి ప్రభుత్వం లక్ష్యం.!

-38 వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:**
ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం 2.0 ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న పక్కా గృహాల కోసం అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని 38 వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు పిలుపునిచ్చారు ,అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, ప్రతి ఒక్క పేద కుటుంబానికి సొంత ఇల్లు ఏర్పాటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, సంకల్పమని ఈ లక్ష్యానికి అనుగుణంగా యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు,అనంతరం జియో టాగ్ ద్వారా లబ్దిదారుని ఇంటి స్థలాన్ని పరిశీలిస్తారన్నారు. సొంత ఇల్లు సంబంధించి గ్రామాల్లోని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను / సంక్షేమ సహాయకులను సంప్రదించి దరఖాస్తు ఉన్నవారు గతంలో ప్రభుత్వం ద్వారా పక్కాఇల్లు పొందినవారుఅనర్హులన్నారు.నెలసరి ఆదాయమురూ.15వేలు మించి ఉండరాదన్నారు అర్హులైన పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2029 లోపు గృహ నిర్మాణం చేసుకోవాలి అనుకుంటున్నవారు ఈనెల 30 లోపుదరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత కేంద్రప్రభుత్వానికి చెందిన అధికారిక వెబ్సైట్ లో రిజిస్ట్రేషన్ కి అవకాశం ఉండదని తెలిపారు.



---

# తేమ శాతం, నాణ్యత పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు.!

## రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తి ని కొనుగోలు చేయాలి. -కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏపీ రైతు సంఘం నాయకులు.

## ప్రత్తి రైతుల ఇబ్బందులు తెలుసుకున్న రైతు సంఘం నాయకులు నాయకులు.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 25:**
ఇటీవల కృష్ణ అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి పంటను తేమ శాతం, నాణ్యత పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని, రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తి ని కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. రామచంద్రుడు,జిల్లా సహాయ కార్యదర్శి ఏ. సురేష్ లు డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలో భారత ప్రభుత్వ పత్తి కొనుగోలు సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం మురారి కాటన్ మిల్లు వద్దకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఏ. సురేష్ లు వెళ్ళి పత్తి కొనుగోలులో జరుగుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో గడిచిన రెండు రోజుల క్రితం నుండి ప్యాపిలి, క్రిష్ణగిరి,ఓర్వకల్ ,మిడుతూరుమండలాల నుండి కొనుగోలు కేంద్ర వద్ద పడిగాపలుకాస్తున్న మని రైతులు నాయకుల దృష్టికి తెచ్చారు.తేమ శాతం ఎక్కువ ఉందని, పత్తి కలర్ మారిందని చెప్పుతూ కొనుగోలు కేంద్రం కు తెచ్చిన ప్రత్తిని కొనుగోలు చేయడం లేదని నాయకులకు రైతులు తెలిపారు. నాణ్యత, తేమశాతం పేరుతో రెండు రోజుల నుండి పత్తి కొనుగోలు జరగక ఇక్కడే ఉన్నందువల్ల, బాడుగకు తెచ్చుకున్న వెహికల్ బాడుగలు కూడా కట్టలేని పరిస్థితిలో రైతులం ఉన్నామని, ఈ సంవత్సరం కురిసిన అధిక వర్షాల వల్ల దిగుబడి తగ్గిపోవడమే కాకుండా, పత్తిలో నాణ్యత కూడా కాస్త తగ్గిందని, వాటిని సాకుగా చూపి అధికారులు పత్తిని కొనలేమని చెప్పితే వెనక్కి తీసుకపోలేమని, బయట మధ్య దళారులు రూ. 5,000 రూపాయలకు కూడా కొనడం లేదని ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు నాయకులతో వాపోయారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ మంత్రి భారత ప్రభుత్వానికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఉత్తరం రాశారని తేమ శాతం లో సడలింపు కావాలని, 18 శాతం వరకు రైతులకు మినహాయింపునిచ్చి కొనుగోలు చేయమని రాష్ట్రప్రభుత్వం తరపున ఆపిల్ చేస్తున్నారన్న విషయాన్నీ గుర్తు చేశారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రం అధికారులు కూడా రైతుల పట్ల సానుకూలంగా స్పందించి నాణ్యత పేరుతో వెన్నక్కి పంపకుండా రైతులు పండించిన మొత్తం ప్రతి పంటను కొనుగోలు చేయాలని,పత్తి రైతులకు న్యాయం చేయాలని సిసిఐ అధికారులను కోరారు. కప్పాస్ యాప్ పేరుతో స్లాట్ బుకింగ్ అని గత పది రోజుల నుంచి బుకింగ్ కాకుండా రైతులు ఇబ్బంది పడ్డారు, ప్రస్తుతం ఎక్కడో సుదూర ప్రాంతాల నుండి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన తర్వాత నాణ్యత పేరుతో వెనక్కి తీసుకెళ్లామంటే ఎక్కడికి తీసుకువెళ్తారు, అటువంటప్పుడు ప్రభుత్వం ఈక్రాప్ ఆధారంగా ఇంటి వద్దనే వారి పత్తి నాణ్యతను పరిశీలించి స్లాట్ బుకింగ్ డేట్ ఇచ్చి ఉంటే ఇంత దూరం వచ్చేవారు కాదు కదా? ఇప్పుడు రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు. పకృతి వల్ల పంట నష్టం జరిగి, నాణ్యతలో తేడా ఏర్పడితే అందుకు ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాల్సింది పోయి నాణ్యత పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదని, రైతులకు అధికారులు సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు కూడా స్వయంగా జోక్యం చేసుకొని పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద జరుగుతున్న ఇబ్బందుల్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పత్తి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మిడుతూరు మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన దూదేకుల మౌలాలి, చాకలి బాబు, చౌటుకూరు వెంకటరమణయ్యగడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన హరి అనే రైతుల పత్తిని కొనుగోలు చేయకుండా సిసిఐ వాళ్ళు ఆపడం జరిగింది. ఇది అన్యాయమని సీసీఐ అధికారులను మరియు జిల్లా వ్యవసాయ అధికారికి ఫోన్ ద్వారా తెలియజేసిన కూడా ఏ మాత్రం కూడా స్పందించకపోవడం చాలా అన్యాయమని, ఇంత దూరం వచ్చిన తర్వాత పత్తి కొనుగోలు చేయకుండా వారిని వెనక్కిపంపడం వల్ల రైతాంగం తీవ్ర నష్టానికి గురవుతారు. కావున జిల్లా ఉన్నత అధికారులు, జిల్లా ప్రజా ప్రతినిధులు సకాలంలో జేస్తం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలోవివిధ మండలాల పత్తి రైతులు పాల్గొన్నారు.

# “భారత రాజ్యాంగాన్ని.. పరిరక్షించుకుందాం”..!

## “ప్రజాస్వామ్యానికి హక్కులే పునాదులు’ -76 వ “రాజ్యాంగ దినోత్సవం, జాతీయ న్యాయ దినోత్సవం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 25:**
స్వతంత్ర భారతదేశంలో నవంబర్ 26 న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకునే సాంప్రదాయం 2015 వ సంవత్సరము నుండి కొనసాగుతుంది. ఇదే రోజును జాతీయ న్యాయ దినోత్సవాన్ని “నేషనల్ లా డే “ గా మనం జరుపుకుంటున్నాం. ప్రతి సంవత్సరం నవంబర్ 26 వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్న విషయం మనందరికీ తెలిసిన విషయమే. మన భారత రాజ్యాంగం అమలు 1947 వ సంవత్సరం ఆగస్టు 15 భారత స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగ నిర్మాణం కోసం అనేక విధాలుగా చాలా కసరత్తులు జరిగాయి. మన నాయకులు భారతదేశంలో ఔన్నత్యం కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి మన భారతరత్న రాజ్యాంగ రూపశిల్పి నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో ఆయన కృషి వల్ల కమిటీ పూర్తిస్థాయి రాజ్యాంగాన్ని రూపొందించారు. అనేక మేధోమథనల మధ్య భారత ప్రజల శ్రేయస్సు కోసం, మన దేశం కోసం, లిఖిత రాజ్యాంగాన్ని రచించారు. 1949 వ సంవత్సరంలో నవంబర్ 26 వ తేదీన అప్పటి అసెంబ్లీ దీనిని ఆమోదించి, అంటే రెండు నెలల తర్వాత 1950 వ సంవత్సరంలో జనవరి 26వ తేదీన మన భారతదేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేసి దేశాన్ని సంపూర్ణ గణతంత్ర దేశంగా ప్రకటించినారు. ఆ రోజు నుంచి దేశంలో రాజ్యాంగము అమలులోకి వచ్చినది. 2015 వ సంవత్సరంలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 125 వ జయంతి ఉత్సవాలు సందర్భంగా నవంబర్ 26 వ తేదీన రాజ్యాంగ దినోత్సవం గా జరపాలని భారత ప్రభుత్వము దృఢమైన సంకల్పంతో నిర్ణయించినది. ఈ ఆదేశాల మేరకు నవంబర్ 19 న కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసినది. అప్పటినుంచి నవంబర్ నెల 26 వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని మనము జరుపుకుంటున్నాం. అంతకుముందు ప్రతి సంవత్సరము ఈరోజున జాతీయ న్యాయ దినోత్సవం గా మాత్రమే జరుపుకోవడం ఆనవాయితీగా జరుగుతుండేది. 1979 వ సంవత్సరంలో అప్పటి సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్ .ఎం. సింఘ్వీ సూచన మేరకు ఆరోజును జాతీయ న్యాయ దినోత్సవం గా జరుపుకోవాలని తీర్మానించారు.

### మనదేశంలో అన్నిటికంటే రాజ్యాంగం గొప్పది

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందింది. ప్రపంచంలో సవివరమైన, విపులమైన సమగ్ర రాజ్యాంగం మనదే కావడం ఎంతో గౌరవం, గొప్ప విశేషం. దేశంలోని పౌరులందరికీ సామాజిక ,ఆర్థిక, రాజకీయ, జీవనములో న్యాయం జరగాలన్నది మన రాజ్యాంగము యొక్క ముఖ్య నిర్దేశం. ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యతను మనం అందరము గుర్తు చేసుకోవడానికి రాజ్యాంగ దినోత్సవం పాటిస్తున్నాం. అందుకే మనదేశంలో అన్నిటికంటే రాజ్యాంగం గొప్పది. అదేవిధంగా అన్నిటికంటే ముఖ్యమైన అంశము “రాజ్యాంగంలోని మూడవ భాగము మానవ హక్కులకు పట్టం కట్టింది”. “నాలుగో భాగం సంక్షేమ రాజ్యం అనే భావనను అమలు చేయడమే రాజ్య వ్యవస్థ యొక్క ధర్మం అని నిర్దేశించింది”. ఈ ద్వంద లక్ష్యాన్ని సాధించడానికి కావలసిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం కోసం రాజ్యాంగంలోని మిగిలిన అనేక అంశాలన్నీ ఉన్నాయి. ప్రజాస్వామ్యం, న్యాయ మార్గ పాలన, లౌకికవాదం, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిరపేక్షకంగా ఎన్నికల నిర్వహణ అనే పునాదుల మీద ఈ యంత్రాంగాన్ని నిర్మించడానికి రాజ్యాంగము తోడ్పడుతుంది. ఫెడరల్ వ్యవస్థ అధికారుల విభజన చట్టసభలు రూపొందించే శాసనాన్ని పరిశీలించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉండటం అనేవి పునాదులు పడ్డాయి. వీటన్నిటిని రక్షించుకునే బాధ్యత మన అందరి పైన ఉన్నది.

### భారతదేశంలో రాజ్యాంగం సర్వోన్నతమైనది. దేశంలో అన్ని వ్యవస్థలు రాజ్యాంగ పరిధికి లోబడే పని చేయాలి.


భారతదేశంలో రాజ్యాంగము సర్వోన్నతమైనది దేశంలో అన్ని వ్యవస్థలు రాజ్యాంగ పరిధికి లోబడే పని చేయాలి. అయితే పైన చెప్పిన విధంగా పాలకులు రాజ్యాన్ని పాలిస్తున్నారా? మనువాద పాలకులు గత 13 సంవత్సరాల నుండి భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే విధంగా పాలకులు అనేక కుట్రలు చేస్తున్నారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా అనేక సంస్థలు ఇలాంటి పాలనను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని సంరక్షించుకోవడానికి అనేక ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాజ్యాంగము దాడులను ఎదుర్కొంటుంది మన రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు నుండి బయట పడాలంటే దేశవ్యాప్తంగా ప్రజా చైతన్య శరణ్యం. దేశవ్యాప్తంగా అనేక రకాలుగా ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీ బహుజన సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. అందుకే “మన రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ విధంగా చెప్పారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా, గొప్పదైన, దీనిని అమలు చేసేవాళ్లు చెడ్డవాళ్ళు అయితే అది పనిచేయదని చెప్పారు.”అందువల్ల భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత 150 కోట్ల జనాభా అందరి పైన ఉంది. ఇందుకోసం మన ప్రజలను చైతన్యం చేయడానికి రాజ్యాంగ విలువలు, లక్ష్యాల మీద పూర్తి అవగాహన కల్పించవలసిన అవసరము మనఅందరి పైన ఉన్నది అనే భావన కలిగి పని చేయాల్సిన అవసరం ఉంది.

### కార్పొరేట్ రాజకీయాలు, పెట్టుబడిదారుల పెత్తనం వల్ల రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడింది.

దేశములో కార్పొరేట్ రాజకీయాలు కొనసాగుతున్నాయి. పెట్టుబడుదారులు దేశంలోని సంపదను కొల్లగొడుతున్నారు వీరి వల్ల రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడింది. ఇలాంటి వారి కార్యకలాపాల వల్ల రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు ప్రమాదం, పూర్తి విరుద్ధం. ప్రజలందరూ ఏకం అవ్వాలి దళిత బహుజన మైనార్టీ ఉద్యమాల ద్వారా కార్పొరేట్ల రాజకీయ రంగాన్ని నియంత్రించాలి. వీరిని నియంత్రించకపోతే, ప్రశ్నించకపోతే, మనందరి ఉనికికి ప్రమాదము,



ఇప్పటికే మనమందరం ప్రమాదంలో ఉన్నాం అనే విషయాన్ని కూడా తెలుసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నది. వీరి ద్వారా చాలా నష్టం జరుగుతుంది. దేశంలో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలు ఇంకా పేదవారిగానే ఉంటున్నారు, వివక్ష కొనసాగుతుంది, నిరుద్యోగం నిర్మూలించలేకపోతున్నారు ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. దేశములో సంపద అంత కార్పొరేట్లు పెట్టుబడిదారుల వద్ద ఉంది. అతి తక్కువ జనాభా కలిగిన మనువాదుల వద్ద అంటే 150 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశంలో కనీసం 10 కోట్ల జనాభా లేని వారి వద్ద సంపద కేంద్రీకృతమై ఉంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు సరైన పద్ధతిలో ఉపయోగించుకోకపోవడం వల్లనే బహుజనులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. మనం ఓట్లు అమ్ముకోవడం మనవాదుల పార్టీలకు ఓట్లు వేయడం వల్ల వారు పాలకులవుతున్నారు. అందుకే కార్పొరేట్లు రాజకీయ రంగాన్ని నియంత్రిస్తూ వారి వ్యాపార సామ్రాజ్యం స్వయం ప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. మనువాద పాలకులు భారత రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చి వారి సైద్ధాంతిక భావజాలాన్ని మతం పేరుతో, సనాతన ధర్మమంటూ, ప్రజలను రెచ్చగొడుతూ ప్రజలపై రుద్దడం ఎంతవరకు సమంజసం? పాలకులు ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాల్సిన వారే మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తూ శాస్త్రీయ వైఖరులకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. వీటన్నిటిని నిర్మూలించడానికి పౌర సమాజం దేశవ్యాప్తంగా నైతిక బాధ్యతగా మెలగాల్సిన అవసరం ఉంది. పాలకులు ప్రశ్నించే గొంతులను నొక్కిస్తున్నారు. చరిత్రను, చారిత్రక చిహ్నాలను ధ్వంసం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రజా శ్రేయస్సు ను మర్చిపోయారు. పాలకులు కార్పొరేట్లకు దాసోహం అంటూ వారి సైదాంతిక భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారు. రాజ్యాంగ విలువలను నాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి. మన రాజ్యాంగం అత్యున్నత విలువలతో కూడుకున్నది. కుల, మత, భాష, లింగ,




ప్రాంత, జాతి, మొదలైన తారతమ్యాలు లేకుండా ప్రజలందరూ సమానమేనని రాజ్యాంగం పునరుద్ధరించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయం, లౌకికవాదం, సమగ్రత, మొదలైన అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఆచరించేలా రూపొందించారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలతో, దేశ ప్రజలందరూ ఒకటే అని చాటి చెప్పింది. నియమాలు, ప్రతిజ్ఞలు, హక్కులు, బాధ్యతల సమాహారమే మన రాజ్యాంగం. ఈ రాజ్యాంగాన్ని నవభారత నిర్మాత భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి రూపొందించినది. అందుకు రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మన అందరి పైన ఉన్నది. ఎందుకంటే కుల, మత ప్రాంతీయ, బాహోద్వేగాలను రాజకీయాలకు వాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగ విలువలను, సామాన్య ప్రజలకు, నేటి బాలలకు నేర్పించడం అత్యావశకం, మతోన్మాద దాడుల నుండి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరిని ఏకతాటిపైకి వస్తారని మేధావులు అందరూ భావిస్తున్నారు. మన దేశం సెక్యులర్ దేశం, వివిధ మతాలు, కులాలు, విభిన్న సంస్కృతులకు నిలయమైన దేశములో రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతుంది. రాజ్యాంగంలో మార్పులు చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు 85 శాతం ఉన్న ఎస్సీ,ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు చెందిన మేధావులు ప్రజాస్వామ్యవాదులు, సోషల్ ఇంజనీర్లు అయిన న్యాయవాదులు, విద్యార్థిని విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ప్రజల హక్కులు, విధులు, 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించినారు. ప్రజలందరూ తమకి ఇష్టమైన నాయకులను ప్రభుత్వాలను ఎన్నుకొనే అవకాశం మన అందరికీ గొప్ప అవకాశాన్ని కల్పించినారు. నేడు దేశవ్యాప్తంగా ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి మారుతున్నారు. పార్టీ ఫిర్యాయింపుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. స్వతంత్ర వ్యవస్థలైన ఈడి, సిబిఐ, ఎన్నికల కమిషన్ల దుర్వినియోగం చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడింది.,కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావలసిఉన్నది. దేశాన్ని రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టాలి. ప్రజాస్వామ్యం సమానత్వం రాజ్యాంగ రక్షణకు అందరూ ఐక్యంగా పోరాడడానికి సిద్ధం కావాలి. ఇంకోవైపు దేశంలో మనువాదులు కులం ఆధారంగా ప్రజలను విభజిస్తున్నారు ఇది భారత రాజ్యాంగం యొక్క సమానత్వ సూత్రానికి విరుద్ధమని అనేకమంది విమర్శకులు పలు సందర్భాలలో అనేక వేదికలలో పేర్కొన్నారు. రాజ్యాంగ లౌకిక స్వభావాన్ని కలిగి ఉండాలని పౌరులు అందర్నీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెపుతుంది. కానీ మనువాదులు ఈ స్ఫూర్తిని వ్యతిరేకిస్తూ కుల వివక్షను ప్రోత్సహించడం, దాడులు చేయడం, హత్యలు చేయడం, మానభంగాలు చేయడం లాంటివి జరుగుతున్నాయి. ఇంకోవైపు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు కులం ఆధారంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతిని తగలబెట్టి అందరికీ సమానమైన హక్కులు ఉన్న రాజ్యాంగాన్ని కానుకగా మనకు అందించారు. బిజెపి పాలనలో దళిత మైనార్టీలపై తిట్టింపు స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. కేంద్రంలో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై, అనేక దాడులు అఘైత్యాలు జరుగుతున్నాయి. సమానత్వం లౌకికవాదం వంటి రాజ్యాంగ మూల సూత్రాలను వ్యతిరేకిస్తున్నారు పాతకాలపు సామాజిక నియమాలను సమర్థించాలని చూస్తున్నారు. మనుస్మృతి వంటి పాత శాస్త్రాల ఆధారంగా వివక్ష చూపించే సిద్ధాంతాలను కొనసాగించడానికి కుట్ర చేస్తున్నారు. రాజ్యాంగం దినోత్సవం వంటి రోజుల్లో కూడా మనువాదులు రాజ్యాంగంపై లౌకిక స్వభావం పై దెబ్బ కొడుతున్నారు. అందువలన బహుజనులందరూ మనువాద సిద్ధాంతాలకు ప్రతిఘటనగా ,వ్యతిరేకంగా, పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నది. రాజ్యాంగం పట్ల విధేయతను చూపిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి దేశభక్తిని చూపిస్తారని కోరుకుందాం.



డా. జి.బాలస్వామి.
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు.
“పూలే అంబేడ్కర్ జ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు”.

---

# ఢాకాకు హసీనా అప్పగింత

## భారత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

ఢాకా,**నవంబర్25ఆంధ్ర ప్రగతి** తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. ’ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత’ అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ లేఖపై న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది. కాగా ఐటిసి తీర్పును ’గమనించాము’ అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంలో వ్యాఖ్యానించింది.

------

# అంగరంగ వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం

## 22 అడుగుల కాషాయ జెండా ఆవిష్కరణ

అయోధ్య,**నవంబర్25ఆంధ్ర ప్రగతి** అయోధ్యలో కాషాయ ధ్వజారోహణ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ.. అయోధ్యకు చేరుకున్నారు. రామ మందిర నిర్మాణ పనుల్లో భాగంగా ఆలయ శిఖరంపై కాషాయ ధ్వజాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఆలయ పనులు పూర్తయ్యాయనడానికి గుర్తుగా ఈ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య శ్రీరామ్‌లల్లా ప్రధాన ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరై ప్రత్యేక



పూజలు చేశారు. అనంతరం రామాలయంపై 22 అడుగుల కాషాయ జెండాను మోడీ ఆవిష్కరించారు. రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుల సమక్షంలో జెండా ఆవిష్కరణ జరిగింది. సాధువులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ‘ధ్వజ్ ఆరోహణ్‘ కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ జెండా లంబకోణ త్రిభుజాకారంలో సూర్యుని చిహ్నాన్ని కలిగి ఉంది. శాశ్వత శక్తి, దైవిక తేజస్సు, ధర్మం, జ్ఞానోదయాన్ని సూచిస్తుంది. శ్రీరాముడితో సంబంధం ఉన్న అన్ని లక్షణాలు ఈ జెండాలో కనిపిస్తాయి. ’ఓం’ చిహ్నంతో చెక్కబడిన జెండాను ఆలయ ’శిఖర్’ పైన ఉంచారు.

---

# సింగర్ జుబీన్ గార్గ్‌ది ముమ్మాటికీ హత్యే

## అసెంబ్లీలో అసోం సిఎం బిస్వశర్మ వ్యాఖ్య

గౌహతి,**నవంబర్25ఆంధ్ర ప్రగతి**
ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ మరణంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని.. అతడిని హత్య చేశారంటూ అసెంబ్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా ఆయన మీడియా ముందు ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ సారి శాసన సభ వేదికగా జుబీన్ మరణంపై సీఎం హిమంత ఈ సంచలన కామెంట్స్ చేయడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం అస్సాం అసెంబ్లీలో గార్గ్ మరణం గురించి చర్చించడానికి ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ సందర్భంగా సీఎం హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ.. జుబీన్ గార్గ్ ది ప్రమాదం కాదని, ఆయన్ను చంపేశారని ఆరోపించారు. మరోవైపు గార్గ్ మరణంపై దర్యాప్తు చేస్తున్న ఏకసభ్య కమిషన్ వాంగ్మూలాలు నమోదు చేయడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి గడువును డిసెంబర్ 12 వరకు పొడిగించింది. గౌహతి హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సౌమిత్ర సైకియా నేతృత్వంలోని కమిషన్ నవంబర్ 3 నుంచి విచారణను ప్రారంభించింది. దీనికి సంబంధించిన నివేదికను సమర్పించే గడువు నవంబర్ 21తో ముగిసింది. దీంతో గడువును డిసెంబర్ 12 వరకు పొడిగిస్తూ ఏకసభ్య కమిషన్ సోమవారం నిర్ణయం తీసుకుంది. గార్గ్ మరణంపై అసలు విషయాలు తెలుసుకునేందుకు అస్సాం ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ సెప్టెంబర్ 19న మరణించిన విషయం తెలిసిందే. సింగపూర్



వెళ్లిన జుబీన్ అక్కడ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆయన మరణంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సీఎం హిమంత బిశ్వ శర్మ ఆదేశాల మేరకు జుబీన్ మృతిపై ఏకసభ్య కమిషన్ దర్యాప్తు ముమ్మరం చేసింది.

---------------

# నెతన్యాహు భారత పర్యటన రద్దు

## ఇటీవలి ఢిల్లీ పేలుళ్లతో నిర్ణయం

న్యూఢిల్లీ,**నవంబర్25ఆంధ్ర ప్రగతి**
ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన మరోసారి రద్దయింది. ఇటీవల ఢిల్లీ ఎర్రకోట పేలుళ్లతో దేశంలో భద్రతా పరిస్థితులు సున్నితంగా మారిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఏడాది నెతన్యాహు పర్యటన రద్దవడం ఇది మూడో సందర్భం కావడం విశేషం. నెతన్యాహు ఈ సంవత్సరం చివరిలో భారత్‌ను సందర్శించాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ, ఎర్రకోట బాంబు దాడి నేపథ్యంలో ఆయన షెడ్యూల్‌లో మార్పు చేశారు. అంతకుముందు సెప్టెంబర్ 19 న జరగాల్సిన ఒక రోజు పర్యటనను కూడా రద్దు చేసిన సంగతి విదితమే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ముందుగా నిర్ణయించిన పర్యటన కూడా వాయిదా పడింది. బెంజమిన్ నెతన్యాహు భారత్‌కు చివరిసారిగా 2018లో వచ్చారు. అయితే 2026లో నెతన్యాహు భారత్‌కు చేరుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు విస్ఫోటంలో 13 మంది మరణించగా, అనేక మంది గాయపడిన విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది.

# ఓటమి లాంచనమే..



**చేతులెత్తేసిన టీమిండియా**

**రెండో ఇన్నింగ్స్ లోనూ అదే తడబాటు**

**27 పరుగులకే 2 వికెట్లు సమర్పణ**

**భారత్ ముందు 549 పరుగుల భారీ లక్ష్యం**

**260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్**

**522 పరుగుల వెనుకంజలో టీమిండియా**

**విజయానికి 8 వికెట్ల దూరంలో సౌతాఫ్రికా**

సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో టీమిండియా చేతులెత్తేసింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) దారుణంగా విఫలమయ్యారు. నైట్‌వాచ్‌మన్‌గా కుల్దీప్ యాదవ్(2 బ్యాటింగ్) బ్యాటింగ్‌కు రాగా.. సాయి సుదర్శన్(2 నాటౌట్)మరో వికెట్ పడకుండా ఆటను ముగించాడు. ప్రస్తుతం భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆఖరి రోజైన బుధవారం మొత్తం బ్యాటింగ్ చేయాలి. లేదంటే టీమిండియా ఘోర పరాజయం తప్పదు. సౌతాఫ్రికా విజయానికి 8 వికెట్లు కావాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా బౌలర్లు ఉన్న ఫామ్ నేపథ్యంలో భారత ఓటమి పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. ఇప్పటికే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అడ్వాంటేజ్‌గా మారింది. ఆఖరి రోజు పిచ్ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారనుంది.అంతకుముందు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా 78.3 ఓవర్లలో 260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 పరుగులు కలుపుకొని మొత్తం 548 పరుగుల ఆధిక్యం సాధించింది. సఫారీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్(180 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 94) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. టోనీ డీ జోర్జి(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49) హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే(4/62) నాలుగు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్(1/67) ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. సెనరన్ ముత్తుసామి(206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) సెంచరీ సాధించగా.. మార్కో జాన్సెన్(91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు.అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోవాలంటే ఈ రోజు మిగిలిన 20 ఓవర్లతో పాటు ఆఖరి రోజు పూర్తిగా బ్యాటింగ్ చేయాలి. లేదంటే ఘోర పరాజయాన్ని భారత్ మూటగట్టుకుంటుంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది. ఈ క్రమంలోనే భారత జట్టుపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. 549 పరుగుల భారీ లక్ష్యాన్ని చూసి ఈ మ్యాచ్ గెలిచినట్టేనని నిట్టూరుస్తున్నారు. టెస్ట్‌ల్లో టీమిండియా మరో ఘోర పరాజయం తప్పేలా లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సిరీస్‌లో టీమిండియా టాప్ ఆర్డర్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు దారుణంగా విఫలమైంది. సీనియర్ ఆటగాళ్లు కూడా పరుగులు చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కేఎల్ రాహుల్ అత్యధిక స్కోరు కేవలం 39 పరుగులు కాగా, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా ఇద్దరి అత్యధిక స్కోరు కూడా 27 పరుగులే. ధ్రువ్ జురెల్ అయితే ఒక్క ఇన్నింగ్స్‌లో కూడా 20 పరుగుల మార్కును దాటలేకపోయాడు. అయితే ఈ సిరీస్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ వాషింగ్టన్ సుందర్. మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి 108 పరుగులు (అత్యధికం 48) చేశాడు. సుందర్ ఒక్కడే 100 పరుగుల మార్కును దాటగా, మిగతా స్టార్ బ్యాట్స్‌మెన్‌లు ఎవరూ వంద పరుగులు కూడా చేయలేకపోయారు.భారత బ్యాట్స్‌మెన్‌లకు సెంచరీ సాధించడం ఈ సిరీస్‌లో ఒక కలగా మారింది. టీమిండియాకు ఇప్పుడు గౌహతి టెస్టులో నాలుగో, ఆఖరి ఇన్నింగ్స్‌లో మాత్రమే బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చివరి ఇన్నింగ్స్‌లో కూడా ఏ ఒక్క భారత బ్యాట్స్‌మెన్ సెంచరీ చేయలేకపోతే, అది ఒక చెత్త రికార్డుగా నమోదవుతుంది. గత 30 సంవత్సరాలలో భారత గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌లలో, టీమిండియా తరఫున కనీసం ఒక్క సెంచరీ కూడా నమోదు కాని సందర్భం మొదటిసారి అవుతుంది. ఈ రికార్డును తప్పిం చుకోవాలంటే ఆఖరి ఇన్నింగ్స్‌లో కనీసం ఒక బ్యాట్స్‌మెన్ అయి నా సెంచరీ చేయాల్సి ఉంటుంది.సంక్షిప్త స్కోర్లు..సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489 ఆలౌట్ భారత్ తొలి ఇన్నింగ్స్ 201 ఆలౌట్ సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 260/5 డిక్లేర్డ్ భారత్ రెండో ఇన్నింగ్స్ 27/2

# స్మృతి మంధాన పెళ్లి వాయిదాపై రూమర్స్



స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల వివాహంలో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వీరి పెళ్లి వాయిదాపై అనేక రూమర్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ముందుగా అనుకున్నట్లు నవంబర్ 23న వీరి పెళ్లి మహారాష్ట్రలోకి సాంగ్లీలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రీవెడ్డింగ్ షూట్ లో స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ఫుల్ జోష్ గా డ్యాన్స్ లు చేశారు. ఒకరి మెడలో మరోకరు పూల మాలలు కూడా వేసుకున్నారు. మరికొన్ని గంటల్లో పెళ్లి వేడుక జరుగనుంది. ఇంతలో స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ కు గుండెపోటు రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పెళ్లిని వాయిదా వేస్తున్నట్లు స్మృతి మంధాన కుటుంబ సభ్యులు ప్రకటించారు. మరుసటి రోజు పలాష్ ముచ్చల్ అస్వస్థతకు గురయ్యి వెంటనే కోలుకున్నాడు. ఆ తర్వాత స్మృతి మంధాన తన ఇన్ స్టాలోని వెడ్డింగ్, నిశ్చితార్థంకు సంబంధించిన అన్నిఫోటోలు, వీడియోలను డిలీట్ చేసింది. ఈ క్రమంలో అసలు వీరి మధ్య ఏంజరుగుతుందో అని నెట్టింట అనేక రూమర్స్ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. స్మృతి మంధాన ను.. పలాష్ చీటింగ్ కూడా చేశాడని వార్తలు తెరమీదకు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలాశ్ ముచ్చల్ సోదరి, సింగర్ పలాక్ ముచ్చల్ తన ఇన్ స్టా వేదికగా వివరణ ఇచ్చారు.స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ మంధాన అనారోగ్యానికి గురవడంతో ప్రస్తుతానికి స్మృతి, పలాశ్ ల వివాహం నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం రెండు కుటుంబాలుకూడా ఒత్తిడిలో ఉన్నాయని.. ఈ సున్నితమైన పరిస్థితిలో ఇరు కుటుంబాల గోప్యతను గౌరవించాలంటూ, తొందరలోనే అన్ని సమస్యలు పరిష్కరం అవుతాయని ఇన్ స్టాలో పోస్టు పెట్టారు. మరోవైపు వీరి పెళ్లిపై ప్రస్తుతం బిగ్ సస్పెన్స్ నెలకొంది. మొత్తంగా స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల ఎపిసోడ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారింది.

# రోహిత్, కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడాలి

**• సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్**

ఇండియా సీనియర్ స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చ జరుగుతోంది. 2027 వన్డే వరల్డ్‌కప్ నాటికి వీరిద్దరూ జట్టులో ఉంటారా లేక మేనేజ్‌మెంట్ తప్పిస్తుందా అనే సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రోహిత్, కోహ్లీ ఇద్దరూ 2027 వరల్డ్ కప్ ఆడాలని, వారి అవసరం టీమ్‌ఇండియాకు చాలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్లు సచిన్, ధోనీ పేర్లను ప్రస్తావించారు. రోహిత్, కోహ్లీకు ఉన్న అనుభవం, మానసిక దృఢత్వం వెలకట్టలేనివని జాంటీ అన్నారు. "వరల్డ్‌కప్ లాంటి మెగా టోర్నీల్లో కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు, ఒత్తిడిని తట్టుకునే మానసిక శక్తి కావాలి. అది వీరిద్దరి దగ్గర పుష్కలంగా ఉంది. అందుకే 2027 వరల్డ్ కప్‌లో వీరు ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని రోడ్స్ చెప్పుకొచ్చారు. యువ ఆటగాళ్లు ఎంతమంది ఉన్నా, ఇటువంటి భారీ ఈవెంట్లలో సీనియర్ల పాత్రే కీలకమని ఆయన విశ్లేషించారు.రిటైర్మెంట్ ఎప్పుడు తీసుకోవాలి అనే ప్రశ్నపై స్పందిస్తూ రోడ్స్ ఆసక్తికరమైన ఉదాహరణలు ఇచ్చారు. "గతంలో సచిన్ తెందూల్కర్, ఎంఎస్ ధోనీ విషయంలోనూ ఇలాంటి ప్రశ్నలే వచ్చాయి. ఎప్పుడు రిటైర్ అవ్వాలి ఎప్పుడు ఆడాలి అనేది పూర్తిగా వాళ్ల ఇష్టం. వాళ్లు పరుగులు చేస్తున్నంత కాలం, ఫిట్‌గా ఉన్నంత కాలం వాళ్లను జట్టులో సెలెక్ట్ చేయాల్సిందే. అనుభవం అనేది మార్కెట్లో దొరికే వస్తువు కాదు" అని రోడ్స్ గట్టిగా సమాధానం ఇచ్చారు. రోహిత్, కోహ్లీ ఇంకా పరుగులు సాధిస్తున్నారని, వారిని పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.ఇక రోహిత్, కోహ్లీ కెరీర్ విషయానికి వస్తే, 2025 మే నెలలో వీరిద్దరూ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చారు. ఇంగ్లాండ్‌తో జరగాల్సిన ప్రతిష్టాత్మక 'ఆండర్సన్ తెందూల్కర్ ట్రోఫీ 2025'కి ముందే వీరు సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్‌లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వన్డేలపైనే పూర్తిగా దృష్టి సారించి, 2027 వరల్డ్ కప్ ఆడాలనే కసి వీరిలో కనిపిస్తోంది.మరోవైపు, టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందే రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించి, యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌కు పగ్గాలు అప్పగించింది.



రోహిత్ ఇప్పుడు ఒక బ్యాటర్‌గా మాత్రమే జట్టులో కొనసాగుతున్నారు. కెప్టెన్సీ భారం లేకపోవడంతో రోహిత్ మరింత స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తాడని, ఇది 2027 వరల్డ్ కప్ మిషన్‌కు ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి జాంటీ రోడ్స్ వ్యాఖ్యలు రోహిత్, కోహ్లీ అభిమానుల్లో కొత్త జోష్ నింపాయి. మరి విరాట్, రోహిత్ ఫ్యూచర్‌పై మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# నిఖిల్ చౌదరి అద్భుతమైన సెంచరీ



ఏ దేశంలోనైనా పలువురు క్రికెటర్లు.. ఆ దేశ క్రికెట్ బోర్డు తమకు ఛాన్స్‌లు ఇవ్వకపోతే.. విదేశీ జట్ల తరపున బరిలోకి దిగుతుంటారు. మన భారత ఆటగాళ్లు అయితే కోకొల్లలు. గతంలో టీమిండియా దిగ్గజ ఆటగాళ్లు పలువురు విదేశీ టోర్నమెంట్లలో తమ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా డొమెస్టిక్ క్రికెట్ టోర్నీలలో చాలామంది భారత ఆటగాళ్లు అద్భుతంగా రాణించారు. ఆ కోవకు చెందిన ఓ ప్లేయర్ గురించి ఇప్పుడు మాట్లాడుకుందామా.. అనుకోకుండా విదేశాలకు వెళ్లిన అతడు అక్కడే చిక్కుకుని స్థిరపడిపోయాడు. మరి అతడెవరో కాదు.. నిఖిల్ చౌదరి.2016-17 మధ్య పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్.. ఇప్పుడు ఆస్ట్రేలియాలో డొమెస్టిక్ టోర్నమెంట్లు ఆడుతున్నాడు. అక్కడ అతడు అటు బంతితో.. ఇటు బ్యాట్‌తో ప్రత్యర్థులను ఊచకోత కోశాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా డొమెస్టిక్ టోర్నమెంట్ షెఫ్ఫీల్డ్ షీల్డ్ ట్రోఫీ 2025-26 జరుగుతోంది. ఈ టోర్నీ 13వ మ్యాచ్‌లో న్యూసౌత్ వేల్స్, టాస్మానియా జట్లు తలపడుతున్నాయి. ఇందులో టాస్మానియా జట్టు తరపున బరిలోకి దిగిన నిఖిల్ చౌదరి అద్భుతమైన సెంచరీ సాధించడమే కాకుండా.. మొత్తంగా 163(9 ఫోర్లు, 5 సిక్సర్లు) పరుగుల భారీ స్కోర్ సాధించి.. ఆ టోర్నీలో సెంచరీ సాధించిన భారత బ్యాటర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. నిఖిల్ విధ్వంసంతో టాస్మానియా జట్టు 8 వికెట్ల నష్టానికి 623 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆ జట్టులో టిమ్ వార్డ్(119), జెవెల్(102) రాణించారు. అటు బ్యాట్‌తోనే కాదు.. ఇటు బంతితోనూ అదరగొట్టాడు నిఖిల్ చౌదరి. ఇక్కడ ఆసక్తికర విషయమేమిటంటే.. కోవిడ్ సమయంలో టూరిస్ట్ విసా మీద ఆస్ట్రేలియా వెళ్లిన నిఖిల్ చౌదరీ.. తిరిగి రాలేక అక్కడే చిక్కుకుపోయాడు. బ్రతుకుతెరువు కోసం అక్కడే పనులు చేస్తూ.. అలాగే క్లబ్ క్రికెట్ ఆడుతూ ఉండిపోయాడు. ఇక అతడి ఆటతీరు చూసిన ఓ కోచ్.. ఆపై హబర్ట్ హర్రికేన్స్ జట్టులో చేరాడు.

# పంత్‌పై రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు

టీమిండియా తాత్కలిక టెస్ట్ కెప్టెన్ రిషభ్ పంత్‌పై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో ఆటగాళ్ల కన్నా ముందే రిషభ్ పంత్ చేతులెత్తేసాడని తెలిపాడు. నాలుగో రోజు సౌతాఫ్రికా బ్యాటింగ్‌ను ఉద్దేశించి అశ్విన్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టాడు.'రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకుంటామనే ఆశ నాకు ఉంది. కానీ మైదానంలో ఆటగాళ్ల బాడీ లాంగ్వేజ్ తీవ్ర బాధకు గురి చేస్తోంది.'అని గుండె పగిలే ఎమోజీతో కెప్టెన్ రిషభ్ పంత్ ఫొటో పెట్టాడు. ముందుండి నడిపించాల్సిన కెప్టెన్ రిషభ్ పంతే భుజాలు దిగేసాడనే విషయాన్ని అశ్విన్ తెలియజేశాడు.ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి ముంగిట నిలిచింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) దారుణంగా విఫలమయ్యారు. నైట్‌వాచ్‌మన్‌గా కుల్దీప్ యాదవ్(2 బ్యాటింగ్) బ్యాటింగ్‌కు రాగా.. సాయి సుదర్శన్(2 నాటౌట్)మరో వికెట్ పడకుండా ఆటను ముగించాడు. ప్రస్తుతం భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆఖరి రోజైన బుధవారం మొత్తం బ్యాటింగ్ చేయాలి. లేదంటే టీమిండియా ఘోర పరాజయం తప్పదు. సౌతాఫ్రికా విజయానికి 8 వికెట్లు కావాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా బౌలర్లు ఉన్న ఫామ్ నేపథ్యంలో భారత ఓటమి పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. ఇప్పటికే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అడ్వాంటేజ్‌గా మారింది. ఆఖరి రోజు పిచ్ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారనుంది. అంతకుముందు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా 78.3 ఓవర్లలో 260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

# జాసన్ రాయ్ సత్తా చాటాడు



ప్రపంచంలోనే రిచ్చెస్ట్ క్రికెట్ లీగ్ అంటేనే ఠక్కున మైండ్‌లోకి వచ్చేది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్). ఈ లీగ్‌లో ఆడాలని ప్రతీ విదేశీ ప్లేయర్ ఉవ్విళ్ళూరుతుంటారు. అయితే ఇంగ్లాండ్ ప్లేయర్స్ మాత్రం కొంచెం డిఫెరెంట్. తమ దేశానికే ప్రాతినిధ్యం ఇస్తామని.. అదే మా ఫస్ట్ ప్రయారిటీ అంటూ వేలంలో అమ్ముడుపోయినా లీగ్ నుంచి అర్థంగా వైదొలుగుతుంటారు. ఆ కోవకు చెందిన ప్లేయర్ ఇంగ్లాండ్ మాజీ ఓపెనర్ జాసన్ రాయ్. ప్రస్తుతం ఐపీఎల్‌లో జాసన్ రాయ్‌పై రెండేళ్ల బ్యాన్ ఉంది. అయితే మనోడు విదేశీ లీగ్స్‌లో మాత్రం తన సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం అబుదాబీ వేదికగా టీ10 లీగ్ జరుగుతోంది. ఇందులో జాసన్ రాయ్ రాయల్ చాంప్స్ తరపున బరిలోకి దిగాడు. అంతేకాదు ఆ జట్టుకు సారథ్య బాధ్యతలు కూడా చేపట్టాడు. పలు మ్యాచ్‌లలో కెప్టెన్ ఇన్నింగ్స్‌లు ఆడాడు గానీ.. తన జట్టుకు విజయాలు అందించడంలో విఫలమయ్యాడు. మొత్తంగా ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతడి స్ట్రైక్ రేటు 162.71గా ఉంది. ఈ విధ్వంసకర ఓపెనర్ బ్యాట్‌తో తన ప్రతాపం చూపించినా.. కెప్టెన్‌గా విఫలమయ్యాడు. రాయల్ చాంప్స్ ఆడిన 4 మ్యాచ్‌లలో అన్నింటా ఓడిపోయి.. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కాగా, జాసన్ రాయ్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.



# భాగ్యశ్రీతో డేటింగ్ అంతా ఉత్తిదే
## కొట్టిపడేసిన హీరో రామ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండింగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది. రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి చెన్నైలో పెరిగాను. ఆయన సినిమాలన్నీ చూసేవాడిని. 'బాషా' సినిమా అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమాకు 100వ రోజు కూడా టికెట్స్ దొరకలేదు. చివరి నిమిషంలో రెండు టికెట్స్ దొరికాయి. దీంతో నేను మా ఫ్రెండ్ వెళ్లాం. ఆరోజు థియేటర్‌లో అభిమానులు ఆ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికే వాళ్లు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి ఉంటారు. డైలాగులు కూడా తెలిసిపోయి ఉంటాయి. అయినా అందరూ ఆసక్తిగా చూడడం చూసి నేను షాకయ్యానని రామ్ తెలిపాడు. ఎవరైనా సక్సెస్ కావాలంటే వారికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి. ఎవరికి వారు తాము చేసే పని మీద శ్రద్ధ కలిగిఉండాలి. అలాగే దానికోసమే పుట్టాం అనిపించేలా చాలా కష్టపడాలి. నాకు ఆ రెండు లక్షణాలు ఉన్నాయి. అందుకే ఎప్పటికైనా విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నాడు.

## ఈ నెల 28న 'అఖండ 2' ప్రీ రిలీజ్ ఈవెంట్
# చీఫ్ గెస్ట్ గా సీఎం రేవంత్ రెడ్డి.!





**షూటింగ్ బిజీ వల్ల రాలేకపోతున్న అల్లు అర్జున్.**

**డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల.**

**డిసెంబర్ 4న ప్రీమియర్ షోలకు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు.**

**ఆంధ్ర ప్రగతి హైదరాబాద్ నవంబర్ 25:**
నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కూడా మరో అతిథిగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈవెంట్‌కు రాలేకపోతున్నారని తెలిసింది. సినిమా విడుదలయ్యాక జరిగే సక్సెస్ మీట్‌లో బన్నీ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు.

భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, 'జాజికాయ జాజికాయ' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు, డిసెంబర్ 4వ తేదీ రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్ షోలు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ఎదురుచూస్తోంది.



# లంబాడీ లేడీగా మిల్కీబ్యూటీ!


మిల్కీబ్యూటీ తమన్నా ప్రయాణం బాలీవుడ్..టాలీవుడ్, కోలీవుడ్ లో దేదీప్య మానంగా సాగిపోతుంది. నటిగా, నర్తకిగా అన్ని రకాల అవకాశాలు అందుకుంటుంది. మూడు భాషల్లోనూ ఈ తరహా అవకాశాలతో సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ బిజీగా ఉండటం అన్నది తమన్నాకే చెల్లింది. హీరోయిన్ గా అవకాశాలు తగ్గినా? అమ్మడు ఎక్కడా నిరుత్సాహ పడకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో? దర్శక, నిర్మాతలు కూడా ఆమె విషయంలో అంతే పాజిటివ్ గా ఉండటం కలిసొచ్చింది. వివాదం లేని నటిగా పేరుండటంతో అవకాశాల పరంగా చాలా మంది నిర్మాతలకు మంచి ఆప్షన్ గా మారింది. రేంజర్ తో తమన్నా రొమాన్స్: ప్రతి భావంతురాల్ని ప్రోత్సహించడంలో తప్పేముందని నవతరం దర్శకులు అమ్మడికి మంచి అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం తమిళ, హిందీ ప్రాజెక్ట్ లతో క్షణం తిరిక లేకుండా గడుపుతోంది. బాలీవుడ్ లో నాలుగు సినిమాలు..తమిళ్ లో ఓ చిత్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో అజయ్ దేవగణ్ హీరోగా నటిస్తోన్న %-%రేంజర్%-% చిత్రంలో హీరోయిన్ గా ఎంపికైందనే ప్రచారం కొన్ని రోజులుగా జరుగుతోంది. తాజాగా అది నిజమేనని మేకర్స్ ధృవీకరించారు. యాక్షన్ అడ్వెంచర్ గా జగన్ శక్తి తెరకెక్కిస్తున్నారు. ఇందులో అజయ్ దేవగణ్ రేంజర్ పాత్రలో కనిపించనున్నాడు. ఆ రెండు పాత్రల తర్వాత: ఆయనకు జోడీగా తమన్నా? లంబాడీ యువతి పాత్రలో కనిపించనుందిట. అడవిలో సాహసాలు చేసే యువతిగా అమ్మడు కనిపించనుందని వినిపిస్తోంది. హీరో పాత్రకు ధీటుగా తమన్నా పాత్ర ఉంటుందని చిత్ర వర్గాల నుంచి లీకైంది. ఈ తరహా పాత్రను తమన్నా ఇంత వరకూ పోషించలేదు. ప్రియురాలిగా , కాలేజ్ స్టూడెంట్ గా ఎన్నో సినిమాల్లో నటించింది. %-%బాహుబలి%-% మొదటి భాగంలోనూ ఓ గూడేనాకి చెందిన యోధిరాలి పాత్రలో కనిపించింది. అవంతిక పాత్రలో ప్రేక్షకుల్ని అలరించింది. అటుపై %-%సైరా నరసింహారెడ్డి%-% చిత్రంలో నృత్య కళాకారిణి పాత్ర పోషించింది. ఈ రెండు పాత్రలు తమన్నా కెరీర్ కి ఎంతో ప్రత్యేకమైనవి. పాత్రల ఫరిది చిన్నదే అయినా? గొప్ప పాత్రలుగా నిలిచాయి. మళ్లీ ఆ తరహా పాత్రలు పోషించలేదు. తాజాగా %-%రేంజర్%-% లో లంబాడీ యువతి పాత్ర ఆమెకు సరికొత్త గుర్తింపును తెచ్చి పెట్టే అవకాశం ఉంది. అయితే ఈసినిమా రిలీజ్ కు మాత్రం ఏడాది సమయం పడుతుంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం షూటింగ్ సహా అన్ని పనులు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది డిసెంబర్ లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీంతో పాటు, తమన్నా మరో నాలుగు హిందీ సినిమాలు కూడా పూర్తి చేయాల్సి ఉంది.

# హరిణ్యారెడ్డితో 27న రాహుల్ పెళ్లి
## సంగీత్ వేడుకల్లో క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ రాక



స్టార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తనకి కాబోయే భార్య హరిణ్యా రెడ్డికు ఇచ్చిన స్పెషల్ గిఫ్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. నవంబర్ 27న జరగనున్న వారి వివాహం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంగీత్ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్న ఈ సమయంలో రాహుల్ ఇచ్చిన సర్‌ప్రైజ్‌కి హరిణ్య తెగ ఫిదా అయింది. టీమ్‌ఇండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ని స్వయంగా సంగీత్ వేడుకకు ఆహ్వానించి, తన కాబోయే భార్యకు రాహుల్ స్పెషల్ ట్రీట్ ఇచ్చాడు. చాహల్‌ను చూసి హరిణ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హరిణ్య తన సోషల్ మీడియాలో .. ఇంత పెద్ద గిఫ్ట్ నా జీవితంలో మర్చిపోలేను. థ్యాంక్ యూ రాహుల్! అంటూ చాహల్‌తో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. హరిణ్యా రెడ్డి చాహల్‌కు వీరాభిమాని. ఆమె తన పోస్ట్‌లో మా సంగీత్‌కు వచ్చి మా వేడుకను ప్రత్యేకం చేసినందుకు చాహల్ గారికి ధన్యవాదాలు అని రాసింది. ప్రస్తుతం రాహుల్ సిప్లిగంజ్, హరిణ్య రెడ్డి, క్రికెటర్ చాహల్ కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా, వీటిని చూసిన అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల రాహుల్, హరిణ్యా కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన విషయం తెలిసిందే. హరిణ్యా రెడ్డి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరుడి కుమార్తె.

# 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర రిలీజ్




మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ప్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ప్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల 28 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలిజ్ అయిన 28 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.

# ఆస్కార్ బరిలో 'మహావతార్ నరసింహ' చిత్రం

భారతీయ యానిమేషన్ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ, విజువల్ వండర్‌గా తెరకెక్కిన 'మహావతార్ నరసింహ' చిత్రం అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్స్ 2026) బరిలో ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీకి అర్హత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. దర్శకుడు అశ్విన్ కుమార్ రూపొందించిన ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడుతున్న 35 మేటి చిత్రాలతో పాటు ఈ అరుదైన గౌరవాన్ని అందుకుంది.

భారతీయ పురాణ గాథలకు హాలీవుడ్ స్థాయి సాంకేతికతను జోడించి, క్లీమ్ ప్రొడక్షన్స్ నిర్మించి, హొంబలే ఫిల్మ్స్ సమర్పించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు సైతం అందుకుంది. ఇప్పుడు ఆస్కార్ బరిలో నిలవడం భారతీయ సినిమాకు, ముఖ్యంగా యానిమేషన్ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ రేసులో 'మహావతార్ నరసింహ'.. డిస్నీ వారి 'జూటోపియా 2', 'కే పాప్ డెమన్ హంటర్స్', జపాన్‌కు చెందిన 'డెమన్



స్లేయర్: కిమెత్సు నో యాబా %-% ఇన్ఫినిటీ కాజిల్', 'స్కార్లెట్' వంటి ప్రపంచ ప్రఖ్యాత యానిమేషన్ చిత్రాలతో పోటీపడనుంది.'మహావతార్ నరసింహ' దర్శకుడు అశ్విన్ కుమార్‌కు ఇది తొలి చిత్రం కావడం విశేషం. చిన్నతనం నుంచి హాలీవుడ్ యాక్షన్ చిత్రాలు, జపనీస్ యానిమే సిరీస్‌లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని ఆయన తెలిపారు. ది హాలీవుడ్ రిపోర్టర్‌తో మాట్లాడుతూ, "'టెర్మినేటర్', 'జురాసిక్ పార్క్', 'అవతార్' వంటి హాలీవుడ్ చిత్రాలు, అలాగే మహాభారతం వంటి మన పురాణ గాథలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ స్ఫూర్తితోనే భారతీయ కథను అంతర్జాతీయ స్థాయిలో చెప్పాలనుకున్నాను. నేను యానిమేలకు పెద్ద అభిమానిని. నా బాల్య స్మృతులు, నేను చూసిన సినిమాల ప్రభావమే ఈ చిత్రం" అని వివరించారు.

98వ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవం 2026 మార్చి 15న జరగనుంది. ఈ కార్యక్రమం ఏబీసీ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా 35 చిత్రాలు పోటీ పడుతున్న ఈ కేటగిరీలో భారతీయ చిత్రం షార్ట్‌లిస్ట్ కావడం ఒక చారిత్రక మైలురాయి. ప్రస్తుతం ఈ చిత్రం ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో వీక్షకుల కోసం అందుబాటులో ఉంది. ఈ అద్భుతమైన విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ యానిమేషన్ చిత్రాలకు అంతర్జాతీయ ద్వారాలు తెరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.